ప్రజాశక్తి

గురువారం 22 ఫిబ్రవరి 2024 5 శ్రీ సత్యసాయి





తమకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తున్న మహిళాసంఘం సభ్యురాలు

ఔను... వాళ్లిద్దరూ ఒక్కటయ్యారు !



♦ఉన్నం.. మాదినేని దోస్త్‌మేరా.. దోస్త్ ♦సురేంద్రబాబు నాన్ లోకలట.. ♦స్థానికులకే టికెట్ ఇవ్వాలని అధిష్టానానికి విజ్ఞప్తి ♦కళ్యాణదుర్గం టిడిపిలో ఆసక్తికర పరిణామాలు

ఒకే పార్టీలో ఉంటున్నా నిన్నా...మొన్నటి వరకు ఆ ఇద్దరు బద్ద శత్రువులుగా ఉంటూ వచ్చారు. 2019 నుంచి ఇప్పటి వరకు ఒకరంటే ఒకరికి గిట్టక బజారులో నిలబడి తలపడిన సందర్భాలూ ఉన్నాయి. అధిష్టానం అనేక మార్లు వీరిద్దరి మధ్య సయోధ్య కుదిర్చే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో అధిష్టానం కొత్త అభ్యర్థిని దింపే ఆలోచన చేస్తున్నట్టు ప్రచారం నడుస్తోంది. దీంతో కొత్త అభ్యర్థి కళ్యాణదుర్గంలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. అంతే... వెంటనే ఆ ఇద్దరి మధ్య శత్రుత్వం మాయమైపోయింది. ఇద్దరూ కలసి బుధవారం మీడియా సమావేశం ఏర్పాటు చేసి తామిద్దరిలో ఎవరికి టిక్కెట్టు ఇచ్చినా ఒక్కటే.. మరొకరికి అవకాశమివ్వద్దని ప్రకటించడం చర్చనీయాంశమైంది. ఈ వ్యవహారమంతా అనంతపురం జిల్లాలోని కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని టిడిపికి సంబంధించినది.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మాజీ ఎమ్మెల్యే హనుమంతరాయచౌదరి కుమారుడు మారుతీ చౌదరి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాదినేని ఉమా మహేశ్వరనాయుడు మధ్య ఇటీవల కాలం వరకు పచ్చగట్టి వేస్తే భగ్గుమనేది. నిన్న..మొన్నటి వరకు వీరిద్దరి మధ్య నీవెంత అంటే నీ వెంత అన్న పరిస్థితి ఉండేది. 2109 ఎన్నికల సమయంలో హనుమంతరాయచౌదరి కుటుంబానికి కాదని ఉమా మహేశ్వరనాయుడుకి అధిష్టానం టిక్కెట్టు ఇచ్చింది. అప్పటి నుంచి ఆ ఇద్దరి మధ్య గ్రూపు తగాదాలు తారాస్థాయిలో చేరాయి. ఈ తగాదాల నడుమే 2019 ఎన్నికల్లో అక్కడ టిడిపి ఓటమి చెందింది. ఆ తరువాత కూడా ఇవి కొనసాగుతూ వచ్చాయి. ఇప్పుడు అధిష్టానం ఆ స్థానం నుంచి ప్రముఖ కాంట్రాక్టర్ అమిలినేని సురేంద్రబాబును బరిలో దింపే ఆలోచన చేస్తున్నట్టు ప్రచారం నడుస్తోంది. గత వారం నుంచే ఆయన అక్కడ గృహ నిర్మాణపు పనులు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ఉన్నఫలంగా ఇద్దరు నేతలు మారుతీ చౌదరి, ఉమా మహేశ్వరనాయుడు ఏకమై మీడియా సమావేశం ఏర్పాటు చేయడం ఆసక్తికరంగా మారింది. ఇద్దరు స్థానికులం, పార్టీ కోసం జెండాలు మోసినవాళ్లం. తమకు కాదని స్థానికేతరులకు ఏ రకంగా టిక్కెట్టు ఇస్తారని అధిష్టానాన్ని వీరు ప్రశ్నిస్తుండటం గమనార్హం. తమలో ఎవరికిచ్చినా పార్టీ విజయాని కృషి చేస్తామని కలసి చెప్పడం ఆ పార్టీ శ్రేణులనే విస్మయానికి గురి చేసింది. ఎందుకంటే ఐదేళ్లగా రెండు గ్రూపుల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే విధంగా పరిస్థితి ఉండేది. దీంతో క్షేత్ర స్థాయిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా రెండు గ్రూపులుగా విడిపోయి ఉన్నారు. ఈ క్రమంలో ఇప్పుడు ఈ ఇద్దరు నేతలు కలసి ఈప్రకటన చేయడం నాయకులను, కార్యకర్తలను విస్మయానికి గురి చేసింది. వీరి కోసమా తమ పార్టీ వారితోనే వైరం పెట్టుకున్నాం అని వ్యాఖ్యానిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పుడు వీరిద్దరూ ఏకమవడంతో సర్దుబాటు ఎలాగన్న గందరగోళంలో పడ్డారు. తనకే టిక్కెట్టు అని భావిస్తూ రకాల ఏర్పాట్లు చేసుకుంటున్న తరుణంలో ఇప్పటి వరకు ఒకరంటే ఒకరికి గిట్టనట్టుగానున్న ఆ ఇద్దరు నేతలూ కలసి ఈ రకంగా మాట్లాడటంతో అమిలినేని సురేంద్రబాబు పరిస్థితి ఏమిటన్నది మరో ఆసక్తికరమైన అంశంగానూ మారింది. ఎందుకంటే సురేంద్రబాబు 2009 నుంచి రాజకీయ రంగ ప్రవేశానికి ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. ప్రజారాజ్యం ద్వారా 2009లో అనంతపురం అసెంబ్లీకి పోటీ చేయాలని భావించారు. ఆయనకే టిక్కెట్టు అని భావిస్తున్న తరుణంలో చివరి నిమిషంలో మార్పు జరిగి టిసి.ప్రకాశ్‌కు ఇచ్చారు. దీంతో ఆయన కన్నీటి పర్యాంతమూ అయ్యారు. ఆ తరువాత 2014 ఎన్నికల్లో టిడిపి అనంతపురం అసెంబ్లీకి టిక్కెట్టు ఖరారైంది. చివరి నిమిషంలో మార్పు జరిగింది. దీంతో రెండోసారి నిరాశే ఎదురైంది. 2019లోనూ ప్రయత్నం చేసినా ఎక్కడా అవకాశం లభించలేదు. ఇప్పుడు తాజాగా 2024లో కళ్యాణదుర్గానికి దాదాపు ఖరారంటూ ఏర్పాట్లు చేసుకుంటున్న తరుణంలో అక్కడి నాయకులు ఈ రకమైన ప్రకటన చేయడంతో ఈసారి సురేంద్రబాబు పరిస్థితి ఏమవుతుందోనన్న చర్చ రాజకీయవర్గాల్లో నడుస్తోంది. ఇప్పుడు అధిష్టానం ఎటువంటి నిర్ణయం ప్రకటిస్తుందో చూడాల్సుంది.

పార్టీ జెండా మోసిన వారికే టికెట్ కేటాయించాలి

ప్రజాశక్తి కళ్యాణదుర్గం

కళ్యాణదుర్గం టిడిపి టికెట్ ప్రముఖ కాంట్రాక్టర్ అమిలినేని సురేంద్రబాబు పేరు తెరపైకి రావడంతో స్థానిక టిడిపి వర్గీయులు సతమతమవుతున్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉన్నం హనుమంతరాయ చౌదరి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఉమా మహేశ్వరనాయుడు నానా తంటాలు పడుతున్నారు. ఇందులో బాగానే బుధవారం స్థానిక ఎన్టీఆర్ భవన్ హడావుడి చేశారు. ఈ సందర్భంగా ఉన్నం, మాదినేని ఉమ్మడిగా సమావేశం ఏర్పాటు చేశారు. గతంలో ఇరువర్గాల మధ్య విభేదాలు ఉన్న విషయం వాస్తవమేనని అన్నారు. అయితే పార్టీని నమ్ముకుని పనిచేస్తున్న నాయకులకు కాకుండా ఇతరులకు టికెట్ ఇస్తే సహకరించేది లేదని తేల్చి చెప్పారు. పారిశ్రామికవేత్త ఇక్కడికి వచ్చి హల్‌చల్ చేస్తే సహించేది లేదని అన్నారు. విభేదాలను పక్కనపెట్టి పార్టీ అభివృద్ధి కోసం కలిసికట్టుగా పని చేస్తామని అన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి జెండా మోసిన ఏ వ్యక్తికి టికెట్ కేటాయించిన గెలిపించుకునేందుకు ఇరు వర్గాల నాయకులు కార్యకర్తలు పనిచేస్తామని చెప్పారు. ఇకనుండి ఇలాంటి విభేదాలు ఉండవని ఉన్నం ఉమా మీడియా ముఖంగా చెప్పారు. అనంతరం ఉమా స్వగహానికి ఉన్నం వర్గీయులు, ఉన్నం స్వగహమైన ఎర్రంపల్లి గ్రామానికి ఉమా వర్గీయులు వెళ్లి సమాలోచన చేశారు. నేటి నుంచే పార్టీ బలోపేతానికి సమిష్టిగా కృషి చేద్దామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఆర్టీసీ శంకర్, దొడగట్టి నారాయణ, రామరాజు, నరసాపురం మురళి, దురదకుంట సురేష్, మురళి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఉన్నం హనుమంతరాయ చౌదరి, మాదినేని ఉమామహేశ్వర నాయుడు

డ్వాక్రా రుణాల చెల్లింపులో గోల్‌మాల్..

చేతివాటం ప్రదర్శించిన యానిమేటర్

కన్నీరు పెట్టుకున్న మహిళా సంఘ సభ్యులు

ప్రజాశక్తి-సోమందేపల్లి

డ్వాక్రా రుణాలు తీసుకొని ప్రతినెలా సక్రమంగా కంతులకు సంబంధించిన డబ్బును యానిమేటర్‌కు నమ్మి ఇస్తే చేతివాటం ప్రదర్శించి లక్షల రూపాయల కాజేసిందని మహిళా సంఘాల సభ్యులు వాపోతున్నారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈఘటనకు సంబంధించి బాధితులు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని పత్తి కుంటపల్లిలో శ్రీ సత్యసాయి, నానావళి సంఘాల సభ్యులు బ్యాంకులో రుణం తీసుకున్నారు. ప్రతినెల కట్టే కంతులకు సంబంధించిన డబ్బులను ఆసంఘాల సభ్యులు ఆనిమేటర్ పార్వతికి ఇచ్చేవారు. అయితే ఆమె బ్యాంకులో జమ చేయకుండా తన అవసరాలకు ఉపయోగించుకుంది. శ్రీ సత్యసాయి సంఘ సభ్యులు రెండు సంవత్సరాల క్రితం రెండు లక్షల రూపాయల రుణం తీసుకుని అన్ని కంతులు కట్టివేశారు. తర్వాత రుణం కావాలని పలుమార్లు యానిమేటరు అడిగారు. అయితే ఆమె ఈరోజు, రేపు అని చెప్పి ఆరు నెలలుగా కాలయాపన చేసింది. దీంతో ఆ సంఘ సభ్యులు స్థానిక పాలసముద్రంలోని కెనరా బ్యాంకు వారిని కలిసి తాము రుణం మొత్తం కట్టేశామని తమకు కొత్త రుణం మంజూరు చేయాలని కోరారు. దీంతో బ్యాంకు అధికారులు ఆసంఘం బ్యాంకు ఖాతాను పరిశీలించారు. ఇంకా 75 వేల రూపాయలు అప్పు మిగిలి ఉందని అది కట్టివేస్తే రుణం ఇస్తామని చెప్పారు. దీంతో సంఘం సభ్యులు అవాక్కయ్యారు. సభ్యులందరూ వెళ్లి ఆనిమేటర్ పార్వతిని నిలదీశారు. తమకు జరిగిన అన్యాయాన్ని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. అయితే ఆ అధికారులు గుట్టు చప్పుడు కాకుండా యానిమేటర్ కు సర్ది చెప్పి ఆమె వాడిన మొత్తం అమౌంట్ ను బుధవారం లోపు కట్టే విధంగా సెటిల్మెంట్ చేశారు. ఈ విషయం పలు సంఘాల సభ్యులకు తెలిసింది. తమకు ఇచ్చిన రుణం ఏమైందోనని నానావళి సంఘ సభ్యులు బుధవారం పాలసముద్రం కెనరా బ్యాంక్ మేనేజర్‌ను కలిశారు. ఆసంఘం బ్యాంకు ఖాతాను చెక్ చేయించారు. నానావళి మహిళా సంఘ సభ్యులు 10 మంది ఉండగా వారు రూ. 6.60 లక్షలలు రుణం తీసుకున్నారు. ఒక్కొక్క సభ్యురాలు నెలకు మూడు వేల రూపాయలతో 30 వేల రూపాయలు వసూలు చేసి సభ్యులలో ఒకరిద్దరూ ఆనిమేటర్‌తో కలిసి బ్యాంకుకు వెళ్లి కంతు కట్టేవారు. అయితే సంఘ సభ్యులు నిరక్షరాస్యులు, అమాయకులు కావడంతో ఆనిమేటర్ వారితో డబ్బు తీసుకొని తానే బ్యాంకు స్లిప్ రాసి ఇచ్చిన అప్పులో కొంత మాత్రమే కట్టి మిగతా మొత్తాన్ని తన అవసరాలను వాడుకున్నట్లు బయట పడింది. ఫిబ్రవరి 12న సంఘ సభ్యులు అందరూ రూ.29,500 వసూలు చేసి బ్యాంకులో రుణం కంతుకట్టడానికి యానిమేటర్ తో వెళ్లగా ఆనిమేటర్ బ్యాంకులో కేవలం రూ. 2, 950లు మాత్రమే బ్యాంకులో కట్టి బ్యాంక్ వారిచ్చిన స్లిప్పులో మరో సున్నా చేర్చి ఆస్లిప్పును సంఘ సభ్యులకు ఇచ్చినట్లు గుర్తించారు. ఒక్కొక్క కంతుకు రూ. 30,000 వేల ప్రకారం మొత్తం 15 కంతులకు గాను కేవలం రూ. 1. 65 లక్షలు మాత్రమే బ్యాంకులో జమ చేయగా ఇంకా రూ. 5. 50 లక్షలు బాకీ ఉన్నట్లు బ్యాంకు అధికారులు స్టేట్‌మెంట్ ఇచ్చారు. దీంతో నానావళి సంఘ మహిళా సభ్యులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. కూలీనాలి చేసి అప్పు కట్టామని ఆనిమేటర్ చేతివాటం ప్రదర్శించడంతో బ్యాంకులో అప్పు అట్లే ఉండిపోయిందని కన్నీరు పెట్టుకున్నారు. వెలుగు అధికారులు తమకు న్యాయం చేయకపోతే ఈ విషయంపై జిల్లా స్థాయి అధికారులకు విన్నవిస్తామని , పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తామని చెప్పారు.



మండల సమాఖ్య భవనం

ఎపిఎం రామాంజనేయులు వివరణ : పత్తికుంటపల్లి డ్వాక్రా సంఘాల లో జరిగిన అవకతవకలపై ఎపిఎం రామాంజనేయులును వివరణ శ్రీ సత్యసాయి సంఘంలో జరిగిన అవకతవకలపై విచారణ చేసి ఆనిమేటర్ పార్వతి తోనే ఆమె వాడుకున్న డబ్బును కట్టించామన్నారు. ఆ సంఘానికి 10 లక్షల రూపాయల లోన్ కూడా మంజూరు చేయడానికి బ్యాంక్ వారికి విజ్ఞప్తి చేశామన్నారు. ఇక నానావతి సంఘంలో జరిగిన అవకతవకలపై ఆ సంఘ బ్యాంక్ స్టేట్‌మెంట్ తీసుకున్నామని దీనిపైన తమ సీసీతో విచారణ చేయిస్తామని చెప్పారు. అవకతవకలు నిజమని తెలిస్తే సంఘ సభ్యులు నష్టపోయిన అమౌంటును ఆనిమేటర్ తోనే కట్టిస్తామని చెప్పారు. ఆనిమేటర్ చేసిన అవకతవకలను జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి వారి సూచన మేరకు ఆనిమేటర్ పై చర్యలు తీసుకుంటామని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌కుమార్

ఎన్నికల నిర్వహణలో...

సెక్టార్ అధికారులది కీలక పాత్ర

కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా ఎన్నికల విధులను నిర్వర్తించే సెక్టార్ అధికారులు, పోలీస్ అధికారుల పాత్ర కీలకమైందని జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లో ఉదయం నుంచి సాయంకాలం వరకు ఎన్నికల ప్రక్రియపై సెక్టార్, పోలీస్ సెక్టార్ అధికారులకు జరిగిన అవగాహన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు డిఆర్‌ఒ కొండయ్య, ఆర్డీవో భాగ్యరేఖ, మాస్టర్ ట్రైనర్లు సూర్యనారాయణ, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ మైముద్దీన్ పాల్గొన్నారు. మొదట పోలీస్ సెక్టార్ అధికారులు నిర్వహించవలసిన ఎన్నికల విధులను అమలు చేయవలసిన అధికారాల గురించి జిల్లా కలెక్టర్ వివరించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలపై అవగాహన కల్పించారు. మధ్యాహ్నం వరకు పుట్టపర్తి, ధర్మవరం, పెనుకొండ, కదిరి, అలాగే మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు హిందూపురం, మడకశిర, నియోజకవర్గాలకు చెందిన అధికారులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా నిర్వహించడంలో సెక్టర్ అధికారులది కీలకపాత్ర అన్నారు. ఎన్నికల సమయంలో అప్రమత్తంగా ఉంటూ సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూ జిల్లాకు మంచి పేరు తేవాలని ఆయన తెలిపారు. భారత ఎన్నికల కమిషన్ జారీ చేసిన నిబంధనలు మేరకు ఎన్నికల విధులను జాగ్రత్తగా నిర్వహించాలన్నారు. ముఖ్యంగా ఈవీఎం, వివి ప్యాడ్స్, హ్యాండ్ బుక్, పోలింగ్ కేంద్రాల వివరాలు జాబితా సిద్ధం చేసుకొనుట బ్యాలెట్ కంట్రోల్ యూనిట్ పనితీరు మాక్ పోలింగ్ తదితర పనులు నిర్వహణ పూర్తిస్థాయిలో సంసిద్ధులై ఉండాలన్నారు. సెక్టార్ పోలీస్ ఇతర అధికారులు సంయుక్తంగా కలిసి పార్లమెంటు ఆయా అసెంబ్లీ నియోజకవర్గంలోని పోలింగ్ స్టేషన్లను సక్రమంగా రూట్ల వారీగా గుర్తించి వాటిని వెంటనే సందర్శించాలని ఆదేశించారు. అలాగే ఆయా పోలింగ్ కేంద్రాలలో మౌలిక సదుపాయాల కల్పనకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల ముందు రోజు డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి ఎన్నికల సిబ్బందిని తరలించే క్రమంలో ఆయా పోలింగ్ స్టేషన్లో వరకు రహదారులు, వాహనాల రాహపోకలు విషయాలను ముందస్తుగా గ్రహించి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. నియోజకవర్గాల పరిధిలో ఎక్కడికక్కడ ఉన్న చెక్‌పోస్టులు ఉన్నచోట్ల డబ్బు, మద్యం, ఇతర వాటితో ఓటర్లను ప్రభావితం చేసే విధంగా వస్తువుల పంపిణీ తదితర చర్యలను అడ్డుకోవాలన్నారు. సమస్యాత్మకంగా ఉన్న పోలింగ్ కేంద్రాలను ముందుగానే కనిపెట్టి ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో ప్రశాంత వాతావరణం ఉండే విధంగా ఓటర్లు స్వచ్ఛందంగా స్వేచ్ఛగా ఓటు వేసే విధంగా గట్టి బందోబస్తుతో భద్రత కల్పించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సెక్టార్, పోలీస్ సెక్టార్ అధికారులు పాల్గొన్నారు.

గుడ్‌విల్ చెల్లించలేదని

దస్తావేజులేఖరుల కార్యాలయాలు సీజ్

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

తాము నిర్ణయించిన గుడ్‌విల్ పూర్తిస్థాయిలో చెల్లించలేదన్న కారణంతో దస్తావేజులేఖరుల కార్యాయాలను మున్సిపల్ అధికారులు బుధవారం సీజ్ చేశారు. నెలరోజుల వ్యవధి ఇస్తే గుడ్‌విల్ చెల్లిస్తామని మున్సిపల్ అధికారులకు విన్నవించినా వారు పట్టించుకోకుండా తమ కార్యాలయాలను సీజ్ చేశారని డాక్యుమెంట్ రైటర్లు వాపోతున్నారు.

ధర్మవరం మున్సిపల్ అధికారులు ఒత్తిడి తెచ్చి స్థానిక కాయగూరల మార్కెట్‌పై అంతస్తులో రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని ఏర్పాటుచేశారు. పక్కనే ఉన్న గదులను ప్రతి ఒక్కరు ఒక్కో గదికి గుడ్‌విల్ ఇచ్చి తప్పని సరిగా తీసుకోవాలని రైటర్ల మెడపై కత్తిపెట్టి డిమాండ్ చేశారు. అదే వృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న రైటర్లకు ఇష్టం లేక పోయినా గదులకు గుడ్‌విల్‌తో పాటు అధిక శాతంలో బాడుగ కూడా చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే గదుల్లోకి చేరిన తరువాత రైటర్లకు రిజిస్ట్రేషన్ల వంటి కార్యకలాపాలు తగ్గడంతో వారి సంపాదన కూడా పూర్తిగా తగ్గిపోయింది. అయినప్పటికి ఒక్కో గదికి రూ.9.50 లక్షల గుడ్‌విల్ చెల్లించాల్సిందేనంటూ అధికారులు డిమాండ్ చేయడంతో అందుకు అయిష్టంగానే ఒప్పుకున్న రైటర్లు ఇప్పటికే దాదాపు 50 శాతం అప్పోసప్పో చేసి చెల్లించారు. అప్పటినుంచి ఆన్లైన్ సమస్య వల్ల రిజిస్ట్రేషన్లు నత్తనడకన సాగుతుండటంతో రైటర్లకు బాడుగ చెల్లించడానికే గగనంగా మారింది. ఇలాంటి తరుణంలో మున్సిపల్ అధికారులు ఒక్కసారిగా రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లి మిగిలిన గుడ్‌విల్ చెల్లించాలని డిమాండ్ చేశారు. అయితే ఒక నెల గడువు ఇవ్వాలని కోరినప్పటికి అది పట్టించుకోకుండా 12 గదులను సీజ్ చేశారు. దీంతో ఒక ప్రక్క దస్తావేజుదారులు మరో వైపు రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన సామాన్య ప్రజానీకం తీవ్ర ఇబ్బందులుపడ్డారు.



గదులను సీజ్ చేస్తున్న మున్సిపల్ అధికారులు

'అనంత' నుంచి కాంగ్రెస్ ఎన్నికల శంఖారావం

మాజీ మంత్రి డాక్టర్ శైలజానాథ్

ప్రజాశక్తి-హిందూపురం

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల శంఖారావాన్ని అనంతపురం నుంచి ప్రారంభిస్తున్నట్లు ఎపిసిసి మాజీ అధ్యక్షులు, మాజీ మంత్రి డాక్టర్ శైలజనాథ్ తెలిపారు. బుధవారం పట్టణంలోని ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో శైలజనాథ్, రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షులు జంగా గౌతమ్, ఏఐసీసీ మెంబర్ కెటి శ్రీధర్, పార్లమెంట్ ఇన్‌ఛార్జి సత్తార్, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు బాలాజీ మనోహర్, హరిత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శైలజనాథ్ మాట్లాడుతు రాష్ట్ర పార్టీ అధ్యక్షులు షర్మిల అధ్యక్షతన ఈనెల 26న అనంతపురంలో ఎన్నికల శంఖారావాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, రాష్ట్ర ఇన్‌చార్జి మాణిక్యం ఠాగూర్, కాంగ్రెస్ పెద్దలు రఘువీరారెడ్డి, మాజీ మంత్రులు, తదితర మఖ్యనాయకులు పాల్గొంటారని చెప్పారు. జగన్ ప్రభుత్వానికి ఓటమి భయం పట్టిందన్నారు. ఆ భయం నుంచి బయటపడడానికి అధికారంలో ఉన్న వైసిపి ప్రభుత్వం అధికారులను అడ్డం పెట్టుకుని, వందల కోట్లు ఖర్చు పెడుతూ సిద్ధం సభలను ఏర్పాటు చేసి జన బలాన్ని చూపిస్తోందని విమర్శించారు. అనంతపురం జిల్లా రాప్తాడు లో ఏర్పాటు చేసిన సిద్ధం సభలో జిల్లా అభివృద్ధికి ఏం చేశారో చెప్పలేదన్నారు. కాంగ్రెస్ బలపడితే వైసిపి ఖాళీ అవుతుందన్న భయంతో నాయకులను ప్రజలను ఆకర్షించుకోవడానికి సిద్ధం సభలను ముఖ్యమంత్రి ఏర్పాటు చేస్తూ బల ప్రదర్శన చేపడుతున్నారని విమర్శించారు. సభలో ముఖ్యమంత్రి సోది వినలేక జనాలు వెనక్కి వెళు తున్న తరుణంలో ఆ దృశ్యాలను చిత్రీకరించిన మీడియా ఫోటోగ్రాఫర్ పై దాడికి పాల్పడడం దుర్మార్గమన్నారు. కాంగ్రెస్‌పార్టీ ఈనెల 26న అనంతపురంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రౌఫ్‌సాబ్, అతావుల్లా, అమానుల్లా, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.



హిందూపురంలో విలేకరుల సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

రాష్ట్రంలో కాంగ్రెస్‌దే భవిష్యత్తు

పుట్టపర్తి అర్బన్ : రాష్ట్రంలో ప్రత్యామ్నాయం, భవిష్యత్తు అంతా కాంగ్రెస్‌దే అని పార్టీకి పూర్వ వైభవం రాబోతుందని మాజీ పిసిసి అధ్యక్షులు, మాజీ మంత్రి సాకే శైలజనాథ్ పేర్కొన్నారు. బుధవారం పట్టణం లోని మేడ అతిథిగృహంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పుట్ల గంగాద్రి అధ్యక్షతన నియోజకవర్గ పార్టీ నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ ఈనెల 26న అనంతపురంలో కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభ జరగనున్నదన్నారు. ఆ సభలో జాతీయ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, రాష్ట్ర అధ్యక్షురాలు వైయస్ షర్మిలతో పాటు జాతీయ నాయకులు పాల్గొంటారన్నారు. రాష్ట్రంలో, దేశంలో ప్రత్యామ్నాయ పార్టీగా కాంగ్రెస్ పార్టీ ఎదుగుతుందన్నారు. వైసిపి పాలన వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలన్నారు. ఆ సభకు ప్రతి నియోజకవర్గంలో నుంచి భారీగా జన సమీకరణ చేయాలని పిలుపునిచ్చారు. వర్కింగ్ అధ్యక్షులు గౌతం మాట్లాడుతూ ఇటు తెలంగాణ అటు కర్నాటకలో కాంగ్రెస్ ప్రభుత్వాల పనితీరును రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారన్నారు. తిరిగి రాష్ట్రంలో కూడా కాంగ్రెస్ పట్ల ప్రజలలో నమ్మకం ఏర్పడుతోందన్నారు. ఈ సమావేశంలో ఆ పార్టీ నాయకులు కోట సత్యం, నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాలాజీ మనోహర్, పార్లమెంట్ ఇన్‌ఛార్జి ఖాసీంఖాన్, కెటి. శ్రీధర్, ఆ పార్టీ మహిళా అధ్యక్షురాలు ఖాజీ షకీరా, పటాన్ గౌస్‌తో పాటు ఆరు మండలాల కన్వీనర్లు పాల్గొన్నారు.



విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే సిద్ధారెడ్డి

విగ్రహ ప్రతిష్టాపన

నల్లచెరువు : మండలంలోని గొర్లవాండ్లపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్ధారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే ఇదివరకే రూ. 50 వేలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి రమణారెడ్డి పాల్గొన్నారు.

పలువురికి గోనుగుంట్ల ఆర్థికసాయం

ధర్మవరం టౌన్ : మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ బుధవారం పట్టణంలో పలువురికి ఆర్థికసాయం అందజేశారు. మండలంలోని నేలకోట ఎస్సీ కాలనీకి చెందిన మౌనిక అనారోగ్యంతో బాధ పడుతుండగా వైద్య ఖర్చుల కోసం ఆమె భర్త కోటప్పకు రూ. 15వేలు అందజేశారు. పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన లక్ష్మీనరసమ్మ కుమారుడు వీరప్రతాప్, కోడలు అర్చన వివిధ కారణాలతో మృతిచెందారు. వారి కుటుంబ సభ్యులు గోనుగుంట్ల లక్ష్మీనరసమ్మకు రూ. 10వేలు అందజేశారు.

సమయం వృథా చేసుకోవద్దు

ధర్మవరం టౌన్ : పరీక్షలు సమీపించిన వేళ విద్యార్థులు సమయం వృథా చేసుకోకుండా బాగా చదవాలని శ్రీసాయి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ చాంద్‌బాషా, ప్రిన్సిపల్ ఫణికుమార్ సూచించారు. మేనేజ్‌మెంట్ దినోత్సవం సందర్భంగా కళాశాలలో బుధవారం ప్రిన్సిపల్, అధ్యాపకులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. వారు విద్యార్థులకు మేనేజ్‌మెంట్ ఆవశ్యకత గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు డాక్టర్ సుబ్బారావు, బండ్లపల్లి రంగనాథ్, పోలా ప్రభాకర్, ఎస్ఎం అక్రం, అధ్యాపకులు పాల్గొన్నారు.

పాఠకుల సంఖ్యను పెంచాలి

ధర్మవరం టౌన్ : గ్రంథాలయంలో పాఠకుల సంఖ్యను పెంచాలని గ్రంథాలయ జిల్లా కార్యదర్శి రమా సూచించా రు. పట్టణంలోని బాబు జగ్జీవన్‌రామ్‌నగర్ శాఖ గ్రంథాలయాన్ని బుధవారం ఆమె సందర్శించి రికార్డులు, పాఠకుల అటెండెన్స్, పుస్తకాలు, తదితర వాటిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రంథాలయ అధికారిణి అంజలి సౌభాగ్యవతి, సిబ్బందితో సమావేశం నిర్వహించి, ప్రభుత్వం గ్రంథాలయాల అభివృద్ధికి తీసుకుంటున్న అంశాలపై చర్చించారు. పాఠకులకు అన్ని సౌకర్యాలు కల్పించి, మంచి గుర్తింపు వచ్చేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది సత్యనారాయణ, శివమ్మ, రమణనాయక్ పాల్గొన్నారు.

ఘనంగా అంబేద్కర్ విగ్రహావిష్కరణ

రొద్దం : మండలంలోని నారనాగేపల్లి ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని బుధవారం ముఖ్య అతిథి ఎంపిపి చంద్రశేఖర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సొంతంగా అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. అంబేద్కర్ ఆశయ సాధన కోసం మనమందరం పాటుపడాలన్నారు. కార్యక్రమంలో సర్పంచి నాగార్జున, ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు దండు వీరయ్య, నరసింహులు, హనుమంతు, వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పత్తి చంద్రశేఖర్ పర్యటన

ఓబుళదేవరచెరువు : మండలంలోని సున్నంపల్లి పంచాయతీలో బుధవారం పుట్టపర్తి నియోజకవర్గ జనసేన సమన్వయకర్త పత్తి చంద్రశేఖర్ పర్యటించారు. టిడిపి, జనసేన నాయకులను కలిసి రాబోయే ఎన్నికల్లో జనసేన–టిడిపి ఉమ్మడి అభ్యర్థిని గెలిపించాలని కోరారు. గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకు న్నారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు మేకల ఈశ్వర్, ఉపాధ్యక్షులు ఆర్ట్స్ శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పింఛను మంజూరు చేయండి సారూ..

పుట్టపర్తి క్రైమ్ : మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లి జగనన్న క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న లక్ష్మీనారాయ ణమ్మ పింఛను మంజూరు చేయాలని వేడుకుంటుంది. ఆమెకు భర్త నాగేంద్ర, కూతురు మేఘన ఉన్నారు. అంతుచిక్కని వ్యాధితో ఒంట్లో ఎముకలు పూర్తిగా అరిగిపోయా యి.. వాకర్ లేనిదే నడవలేని పరిస్థితి.. పూర్తిగా మంచానికే పరిమితమయ్యానని ఆవేదన వ్యక్తం చేస్తోంది. నాలుగేళ్ల నుంచి పింఛను కోసం పలుమార్లు దరఖాస్తు చేసుకున్నా ఫలితం లేదని కన్నీరు పెట్టుకుంది.

ఘనంగా స్కౌట్స్ దినోత్సవం

లేపాక్షి : స్థానిక ఓరియంటల్ పాఠశాలలో బుధవారం స్కౌట్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా స్కౌట్స్ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ స్కౌట్స్ క్రమశిక్షణతో మెలుగుతూ తోటి వారికి సహాయం చేయాన్నారు. దేశం, ప్రజల కోసం సేవా భావంతో పని చేయాలన్నారు.

వైభవంగా సీతారాముల కళ్యాణోత్సవం

కదిరిటౌన్ : సేవా భారతి ఆధ్వర్యంలో బుధవారం కదిరి పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో సీతారాముల కళ్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ వ్యాఖ్యాత చాగంటి కోటేశ్వరరావు, టిటిడి ఈవో ధర్మారెడ్డి హాజరయ్యారు. కదిరి డీఎస్పీ శ్రీలత ఆధ్వర్యంలో పట్టణ సీఐ పుల్లయ్య పర్యవేక్షణలో పోలీసులు తగిన బందోబస్తు నిర్వహించారు. ఈ కార్య క్రమంలో టీడీపీ ఇన్‌ఛార్జి కందికుంట, వైసీపీ నాయకులు డాక్టర్ హరిప్రసాద్‌చ ఎస్పీ మాధవ రెడ్డి, బీజేపీ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, పార్థసారథి, కదిరి సేవా భారతి అధ్యక్షులు చెన్నరాయశెట్టి, కుమార్ రెడ్డి, తలుపుల గంగాధర్, ఉత్తమ రెడ్డి, సురేష్, డిఎల్ ఆంజనేయులు, కుంచపు జనార్ధన్, సేవా భారతి సభ్యులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

వైసిపితోనే సంక్షేమం, అభివృద్ధి : మంత్రి

ప్రజాశక్తి-పెనుకొండ

సంక్షేమ పథకాలు అందాలంటే జగనే మరోమారు సిఎం కావాలని మంత్రి ఉషశ్రీచరణ్ పేర్కొ న్నారు. నగర పంచాయతీ పరిధిలోని నారాయణమ్మ కాలనీ, జిఐసి కాలనీ, వజ్రాలపేటలో బుధవారం మంత్రి పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. సంక్షేమ పథకాలు ఇలాగే కొనసాగాలంటే ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఛైర్మన్ ఉమర్ ఫరూక్, వైస్ ఛైర్మన్ సునిల్, ఎఙిపిఎం భాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్లు సుధాకర్‌రెడ్డి, బోయ బాబు, తయూబ్, రఘునాథ్ రెడ్డి, రామంజి, గణేష్, యాసిన్, సద్దాం, క్రిష్టప్ప, శేషాద్రి, భాస్కర్‌నాయక్, జడ్పీటీసీ శ్రీరాములు, ఎంపీపీ గీతా రామ్మోహన్‌రెడ్డి, టౌన్ కన్వీనర్ బోయ నరసింహ, నాయకులు కృష్ణారెడ్డి, సుగుణాకర్‌రెడ్డి, నరేంద్రరెడ్డి, కొండల రాయుడు, శంకర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీచరణ్

పాత్రికేయులపై దాడులు హేయం

మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ప్రభుత్వం చేస్తున్న తప్పులపై పాత్రికేయులు వార్తలు రాయడం తప్పు.? అని మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ సిఎం జగన్‌పై మండిపడ్డారు. పట్టణంలో బుధవారం ఆయన పాత్రికే యుల సమావేశంలో మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం ప్రతిపక్షాలు, ప్రజలతో పాటు పాత్రికేయులపై కూడా దాడులు చేయిస్తూ భయాందోళనకు గురి చేయడం హేయమన్నారు. రాప్తాడులో ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై, కర్నూలులో ఈనాడు, ఆంధ్రజ్యోతి కార్యాలయాలపై వైసిపి ఎమ్మెల్యే అనుచరులతో దాడి చేయించడం దారుణమన్నారు. ప్రజలు అన్నీ చూస్తున్నారన్నారు. ప్రభుత్వం, మంత్రులు, వైసిపి ఎమ్మెల్యేల వైఫల్యాలు, అరాచకాలు, అక్రమాలు, దౌర్జన్యాలను ఎండగట్టారు. తాము అధికారంలోకి రాగానే వైసిపి ప్రభుత్వం అక్రమాలపై చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే కబ్జాలు చేయడమే ప్రథమ లక్ష్యంగా ఎంచుకున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో డిష్ రాజు, తుంపర్తి పరమేష్, బొడగల గిరిధర్, మార్కెట్ రహీం, నారాయణస్వామియాదవ్, దేవేంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సూరి

పలువురు వైసిపిలో చేరిక

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని 1, 3వ వార్డుల్లో చెలిమి పెద్దన్న, శంకర తేజ, యుగంధర్ ఆధ్వర్యంలో స్థానిక శాంతినగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 300 చేనేత కుటుంబాలు ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సమక్షంలో వైసిపిలో చేరారు. కప్పల ఆదినారాయణ, బ్యాళ్ల హరీష్, పురుషోత్తం, సుబ్రమణ్యం, బాబాఫకృద్దీన్, దాసరి లోకేష్, పల్లా గంగాధర్, పారాక్ష నాగరాజు, వెంకటనారాయణ, అన్నం ఆదినారాయణ, సాకే భాస్కర్, భీమనపల్లి నాగరాజు, తదితరులకు ఎమ్మెల్యే వైసిపి కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి పాలనలో 52 చేనేత కార్మికుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున అందించామన్నారు. 1వ వార్డులో కౌన్సిలర్ చెలిమి రామలక్ష్మమ్మ, చెలిమి పెద్దన్న ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైఎస్ విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించి, పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ వేముల జయరామిరెడ్డి, పట్టణ అధ్యక్షులు నీలూరి ప్రకాష్, కోటిరెడ్డి బాలిరెడ్డి, గుర్రం శీన, కౌన్సిలర్లు చెలిమి రామకృష్ణమ్మ, శంకరతేజ, చందమూరి నారాయణరెడ్డి, పి.నాగరాజు, గోరకాటి పురుషోత్తంరెడ్డి, కడప రంగస్వామి, జేసీబీ రమణ, గజ్జల శివ, చింతా మారుతి, చాంద్‌బాషా, ఉడుముల రాము, సిద్ది రాజేష్, కాచర్ల అంజి, గడ్డం రంగ, చెలిమి పెద్దన్న, శంకర, యుగంధర్, కత్తి పెద్దన్న, పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కేతిరెడ్డి సమక్షంలో వైసిపిలో చేరిన నాయకులు

గడప గడపకూ మన ప్రభుత్వం

ప్రజాశక్తి-లేపాక్షి

మండలంలోని పులమతి పంచాయతీలో బుధవారం సర్పంచి అశ్వర్థనారాయణ అధ్యక్షతన 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హిందూపురం సమన్వయకర్త దీపిక పాల్గొని ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. లబ్ధి పొందిన ప్రతి కుటుంబాన్ని కలిసి వచ్చే ఎన్నికల్లో వైసిపికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నారాయణస్వామి, జెడ్పిటిసి శ్రీనివాస్‌రెడ్డి, కోడిపల్లి సర్పంచి మంజునాథ్, నాయకులు ఆదినారాయణ, ప్రభాకర్, కరియప్ప పాల్గొన్నారు.

గ్రామ వాలంటీర్లకు సన్మానం

స్థానిక స్త్రీశక్తి మహిళా సమావేశ మందిరంలో ముఖ్యఅతిథులు హిందూపురం అసెంబ్లీ, పార్లమెంటు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్తలు దీపిక, శాంతమ్మ వాలంటీర్లను సన్మానించారు. వారు మాట్లాడుతూ సిఎం జగన్ తీసుకొచ్చిన వాలంటీర్ వ్యవస్థ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా అర్హులందరికీ ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. వాలంటీర్ల సేవలు ఎంతో ముఖ్యమైనవన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వాసుదేవగుప్తా సర్పంచులు ఆదినారాయణ, అశ్వర్థనారాయణ, వైస్ ఎంపీపీలు అంజిరెడ్డి, నీలావతి, సెక్రటరీలు పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న దీపిక

టిడిపి హయాంలోనే అభివృద్ధి

ప్రజాశక్తి-రొద్దం

టిడిపి హయాంలోనే రాష్ట్రంలో అభివృద్ధి జరిగిందని తెలుగు తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ పేర్కొన్నారు. ఆమె బుధవారం మండలంలోని పెనుకొండ–పావగడ ప్రధాన రహదారిలో కర్నాటక సరిహద్దు వద్ద సెల్ఫీ ఛాలెంజ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2014లో టిడిపి అధికారం చేపట్టగా అప్పటి సిఎం చంద్ర బాబు సహకారంతో పెనుకొండ ఎమ్మెల్యే బికె.పార్థసారధి రూ. 33 కోట్ల వ్యయంతో పెనుకొండ నుంచి పావగడ మార్గంలో కర్నాటక సరిహద్దు వరకూ 20 కి.మీ. మేర రెండు వరుసల తారు రోడ్డు వేయించారని ఆమె తెలిపారు. ఇలాంటి అభివృద్ధి పనులు ఎన్నో చేశారని, వచ్చే ఎన్నికల్లో టిడిపిని గెలిపించాలని ఆమె ప్రజలను కోరారు. ఆమెతో పాటు తెలుగు యువత రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి పుల్లప్పచౌదరి, ఉపేంద్రచౌదరి ఉన్నారు.



అరిగెల సాలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గోనుగుంట్ల సూరి, చిలకం మధుసూదన్‌రెడ్డి

అరిగెల సాలమ్మకు నివాళి

ధర్మవరం టౌన్ : అరిగెల పోతన్న భార్య అరిగెల సాలమ్మ శ్రద్ధాంజలి కార్యక్రమాన్ని బుధవారం పట్టణంలోని అరిగెల పోతన్న రైస్ మిల్లులో ఆమె కుమారులు ఘనంగా నిర్వహించారు. అరిగెల సాలమ్మ చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డితో పాటు పలువురు ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాలమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు. పుట్టపర్తి రహదారిలోని శివాలయం ఎదుట, ఆర్టీసీ బస్టాండ్, అరిగెల పోతన్న ఆసుపత్రి వద్ద పెద్ద ఎత్తునప అన్నదానం ఏర్పాటు చేశారు.

'అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చిన సిఎం జగన్'

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి కమతం కాటమయ్య, పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్, బీరే గోపాలక్రిష్ణ విమర్శించారు. 'బాబు ష్యూరిటీ–భవిష్యత్తుకు గ్యారెంటీ'లో భాగంగా బుధవారం పట్టణంలోని 11వ వార్డులో పట్టణ ప్రచార కమిటీ ఆధ్వర్యంలో వారు ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్, మినీమేనిఫెస్టో పథకాలను వివరించా రు. రాష్ట్రం బాగుండాలంటే టిడిపి–జనసేన ప్రభుత్వం రావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమం లో నాయకులు భీమనేని ప్రసాద్‌నాయుడు, శీలామూర్తి, తలారి చంద్రమోహన్‌బాబు, చింతపులుసు పెద్దన్న, అంబటి సనత్, రాళ్లపల్లి షరీఫ్, అత్తార్ రహీంబాషా, మాదన సుబ్బయ్య, జిలకర శీన, గోసల శ్రీరాములు, మాధవరెడ్డి, మారుతిస్వామి, పోసిన శ్రీనివాసులు, తిరుమలేశ్, ఇర్షాద్, షామీర్, నాగేంద్ర, బీరే శీన, వీర, వాసుదేవ, ఉస్మాన్ యుగంధర్, తెలుగు మహిళలు మాదనమహేశ్వరి, స్వర్ణకుమారి, శారద, నాగరత్న, మీనాక్షమ్మ, మున్ని, చౌడమ్మ, అఖిలమ్మ, భాను, యశోద, వెంకటలక్ష్మీ పాల్గొన్నారు.

పరిగి తహశీల్దార్‌గా రాజేశ్వరి



పరిగి : మండల నూతన తహశీల్దార్‌గా రాజేశ్వరి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల నేపథ్యంలో ఇక్కడ పనిచేస్తున్న సౌజన్య లక్ష్మి కడప జిల్లా ఎర్రగుంట్ల మండలానికి బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో వసుంధరను ఇక్కడ నియమించగా ఆమె బాధ్యతలు స్వీకరించకపోవ డంతో ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా హిందూపురం తహశీల్దార్ శివప్రసాద్ రెడ్డిని కలెక్టర్ నియమించా రు. ఎట్టకేలకు రెగ్యులర్ తహశీల్దార్‌గా రాజేశ్వరి బాధ్యతలు స్వీకరించారు. అధికారులతో సమావేశమైన ఆమె రీసర్వే, కుల గణనపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

నేటి నుంచి 'పల్లె' ఎన్నికల ప్రచారం

పుట్టపర్తి క్రైమ్ : ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో నియోజకవర్గంలో గురువారం నుంచి ఎన్నికల ప్రచారం చేపడుతున్నట్లు బుధవారం మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలి పారు. బుక్కపట్నం మండలంలోని గోపాలపురం గ్రామం నుంచి పల్లె ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తారు.

నేడు 'కందికుంట' ఎన్నికల శంఖారావం

కదిరి టౌన్ : నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ గురువారం ఉదయం ఖాద్రి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తున్నట్లు ఓ ప్రకటనలో తెలిపారు.

అప్రకటిత విద్యుత్ కోతలపై 26న టిడిపి ధర్నా

మడకశిర : మండలంలోని వ్యవసాయ బోర్లకు వేళా పాళా లేకుండా విద్యుత్ కోతలు విధిస్తుండడంతో రైతులు పంటలు నష్టపోతున్నారు. దీనిపై నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో ఈ నెల 26 వ తేదీ మడకశిర మండలం, పట్టణంలోని రైతులతో కలిసి మడకశిర విద్యుత్ ఎడి కార్యాలయం ముందు ధర్నా చేస్తున్నట్లు పార్టీ మండల, టౌన్ కన్వీనర్లు మనోహర్, లక్ష్మీనారాయణ తెలిపారు.

జేఈఈలో మెరిసిన గగన్‌శ్యామ్‌రెడ్డికి సన్మానం

హిందూపురం : ఇటీవల విడుదలైన జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో ప్రతిభ చాటిన గగన్‌శ్యామ్‌రెడ్డిని బుధవారం ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పట్టణంలోని సువర్ణ భారతి జూనియర్ కళాశాలలో ఘనంగా సన్మానించారు. నాయకులు బాబావలి, చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ఇలానే అన్ని పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సువర్ణ భారతి విద్యాసంస్థల అధినేత నీలకంఠారెడ్డి, లోటస్ ఎక్స్‌లెన్స్ పాఠశాల డైరెక్టర్ ప్రజిత్‌రెడ్డి, కళాశాల సిబ్బంది రాము, విద్యార్థి సంఘం నాయకులు లిఖిత్, దేవరాజు, మూర్తి పాల్గొన్నారు.

ల్యాబ్ భవన నిర్మాణానికి భూమిపూజ

గాండ్లపెంట : స్థానిక జడ్పీ హైస్కూల్‌లో బుధవారం కెమిస్ట్రీ ల్యాబ్ భవన నిర్మాణానికి హెచ్ఎం శారదాంబ భూమిపూజ చేశారు. ఆమె మాట్లాడుతూ పిఎం నిధుల ద్వారా కెమిస్ట్రీ ల్యాబ్ భవనానికి రూ. 15.05 లక్షలు, క్రీడా మైదానానికి రూ. 5 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. ల్యాబ్ భవనాన్ని త్వరలోనే పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యా యులు పామిడి ముంతాజ్‌అలీ, జయరాములు, గంగాధర్, రాజగోపాల్, చిన్నప్పయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్టాపనకు విరాళం

కదిరి టౌన్ : నల్లచెరువు మండలంలోని ఉబిచర్ల పంచాయతీ గొర్లవాండ్లపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో సీతారాముల విగ్రహ ప్రతిష్టాపనకు బుధవారం వైసిపి బిసి విభాగం ఉపాధ్యక్షులు డాక్టర్ బత్తల హరిప్రసాద్ రూ. 20వేలు, బిఎస్ మక్బుల్ అహ్మద్ రూ. 50 వేలు అందజేశారు. దాతలను ఆలయ కమిటీ సభ్యులు పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో వజ్రభాస్కర్‌రెడ్డి, జడ్పిటిసి విశ్వనాథ్‌రెడ్డి, దశరథనాయుడు, సర్పంచి సమీవుల్లా, ఎంపీటీసీ నరసింహారెడ్డి, చంద్ర రెడ్డి, కృష్ణారెడ్డి, మధుసూదన పాల్గొన్నారు.

'మన పంచాయతీ-మన వ్యవసాయం'పై అవగాహన సదస్సు

బుక్కపట్నం : స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో బుధవారం 'మన పంచాయతీ–మన వ్యవసాయం'పై సర్పంచులు, రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథులు ఏరువాక కేంద్రం కోఆర్డినే టర్ రామసుబ్బయ్య, శాస్త్రవేత్త రవికిషోర్ ఖరీఫ్, రబీ పంటల స్థితిగతులను తెలియజేశారు. రాబోయ సీజన్‌లో వివిధ పంటల సాగులో చేపటాల్సిన సస్యరక్షణ, నీటి యజమాన్యం, ఎరువుల వాడకం, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం వ్యవసాయ పంచాంగాన్ని సర్పంచులకు అందజేశారు. కార్యక్రమంలో ఎఒ సతీష్‌బాబు, ఎఇఒ సునీత, జిల్లా అగ్రి అడ్వైజరీ ఛైర్మన్ రమణారెడ్డి, సర్పంచి నాగలక్ష్మీరాజు, మండల అగ్రి అడ్వైజరీ ఛైర్మన్ చౌదరి, ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం

ధర్మవరం టౌన్ : పట్టణంలోని కెహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం తెలుగు శాఖ విభాగాధిపతి షమీ వుల్లా ఆధ్వర్యంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బి.త్రివేణి ఆధ్యక్షతన అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం ఘనంగా నిర్వహించారు. త్రివేణి మాట్లాడుతూ భాష సంస్కృతికి నిలయమని, భాష అంతరించి పోకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. అప్పుడే ప్రాంతీయ అభివృద్ధి సాధ్యపడుతుం దన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు షమీవుల్లా, చిట్టెమ్మ, గోపాల్ నాయక్, కిరణ్‌కుమార్, భువనేశ్వరి, పుష్పావతి, స్వామి, ఆనంద్, సరస్వతి, సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-కదిరి టౌన్

సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా బుధవారం కదిరి డివిజన్‌లోని పలు పోలింగ్ కేంద్రాలు, వసతులను జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు పరిశీలించారు. పట్టణంలోని కుమ్మరివాండ్లపల్లి ప్రాథమిక ఉర్దూ పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలతో పాటు రూరల్ మండలంలోని ముత్యాలచెరువు ఎంపియుపి పాఠశాల పోలింగ్ కేంద్రం, గంగన్నగారిపల్లి ఎంపిపి స్కూల్ పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఏర్పాట్ల పై అధికారులకు సూచనలు చేశారు. ఆయన వెంట ఆర్డీవో వంశీకృష్ణ, తహశీల్దార్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

పుట్టపర్తి అర్బన్ : జిల్లా వ్యాప్తంగా నిర్దేశించిన, పెండింగ్ పనులను సత్వరమే పూర్తి చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. కలెక్టర్ బుధవారం సంబంధిత అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ధర్మవరం, హిందూపురం, కదిరి, పెనుకొండలో కేటాయించిన పనులను పూర్తి చేయాలన్నారు. కదిరి, ధర్మవరం, హిందూపురం మున్సిపాలిటీల్లో పెండింగ్ పనులు పూర్తి చేయాలని ఆయా మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. పెండింగ్ పనుల విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యం చూపరాదన్నారు. ఆరోగ్యశ్రీ కార్డులు, ఓటర్ల జాబితాలో స్థానికులకే ప్రాధాన్యత ఇవ్వాలని, ఇతర ప్రాంతాల వారికి చోటు ఇవ్వరాదన్నారు.



పోలింగ్ కేంద్రాల పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రతి ఆసుపత్రిలో గుండెపోటుకు ప్రథమ చికిత్స

ప్రజాశక్తి-హిందూపురం

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా జిల్లా ఆసుపత్రి నుంచి ఏరియా ఆసుపత్రి వరకూ అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో గుండెపోటుకు ప్రథమ చికిత్స అందిస్తున్నామని ఎపి వైద్య విధాన పరిషత్ జిల్లా కోఆర్డినేటర్ పాల్ రవికుమార్ తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన బుధవారం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి వివిధ విభాగాలను పరిశీలించారు. శస్త్ర చికిత్స విభాగంలో వైద్య ఆరోగ్య సిబ్బందితో పాటు రోగులు డ్రెస్ కోడ్ తప్పనిసరిగా పాటించాలన్నారు. సెమినార్ హాలులో మెడికల్ సూపరింటెండెంట్ రోహిల్ కుమార్‌తో కలిసి వైద్యులు, నర్సింగ్ సూపరింటెండెంట్‌తో సమావేశం నిర్వహించారు. డి అడిక్షన్ సెంటర్, గైనకాలజీ విభాగంలో డాక్టర్లు, సిబ్బందిని నియమిస్తామన్నారు. బ్లడ్ బ్యాంక్‌లో పెథాలజిస్ట్ పోస్టును భర్తీ చేయడంతో పాటు మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన వైద్య పరికరాల కోసం ప్రభుత్వానికి నివేదిక పంపామన్నారు. సిబ్బంది నిర్ణీత సమయంలోగా ముఖ ఆధారిత హాజరు వేయలని, లేనిచో చర్యలు తీప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఎంఒ రుక్మిణమ్మ, మానసిక విభాగం వైద్యులు రాజగోపాల్, వైద్యులు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలిస్తున్న డిసిహెచ్ఎస్ పాల్

స్టీల్ పరిశ్రమలో అగ్ని ప్రమాదం.. ఐదుగురికి గాయాలు

ప్రజాశక్తి-హిందూపురం

రూరల్ మడలంలోని గోళాపురం పారిశ్రామికవాడలో బుధవారం అగ్నిప్రమాదం జరిగింది. గాయపడిన ఐదుగురిని యాజమాన్యం కర్నాటకలోని గౌరిబిదనూరు ఆసుపత్రికి తరలించింది. ప్రమాదం ఎలా జరిగింది, ఎంత మంది గాయపడ్డారు, తదితర విషయాలను యాజమాన్యం వెల్లడించకపోవడం గమనార్హం. ప్రమాదం జరిగిన వెంటనే అగ్ని మాపక శాఖకు సమచారం ఇచ్చి, బాధితులను హిందూపురం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాల్సి ఉంది. అయితే పరిశ్రమ నిర్వా హకులు నిబంధనలను అతిక్రమించి గాయపడిన వారిని కర్నాటకకు తరలించడం అనుమానాలకు తావిస్తోంది. దీనిపై తూమకుంట పారిశ్రామిక కార్మిక సంఘం నాయకులు రవికుమార్ మాట్లాడు తూ బాధితులను పరామర్శించేందుకు గౌరిబిదనూరులోని మానస ఆసుపత్రికి వెళ్లగా వారు అక్కడ లేరన్నారు. గాయపడిన ఏడుగురు కార్మికులు ఉదయం 10:30 కు ఆసుపత్రికి వచ్చి చికిత్స పొంది మధ్యాహ్నం 2:30 గంటల సమయంలో వెళ్లి పోయారని, ఎవరికీ ప్రాణాపాయం లేదని ఆసుపత్రి వర్గాలు తెలిపారన్నారు. ప్రమాదంపై జిల్లా కలెక్టర్ సబ్ కలెక్టర్ స్థాయి అధికారులతో సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు.



కుబేర స్టీల్ పరిశ్రమలో బట్టి కాలుతున్న దృశ్యం

చంద్రబాబు పాలనలోనే అభివృద్ధి : గుండుమల

ప్రజాశక్తి-మడకశిర

నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసిన ఘనత టిడిపి అధినేత చంద్రబాబుదే అని టిడిపి ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు. రొళ్ల మండలంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల వద్ద బుధవారం గుండుమల సెల్ఫీ ఛాలెంజ్ చేశారు. ఆయన మాట్లాడుతూ టిడిపి హయాంలో 3 బాలుర, బాలికల గురుకుల పాఠశాలలు, 3 జూనియర్ కళాశాలలు, కొడికొండ చెక్ పోస్ట్ నుంచి శిర వరకు నేషనల్ హైవే రింగ్ రోడ్డు, వంద పడకల ఆసుపత్రి, హంద్రీ నీవా ద్వారా కృష్ణా జలాలను మడకశిరకు తీసుకొచ్చిన ఘనత చంద్రబాబుదే అన్నారు. సీసీ రోడ్లకు రూ. 50 కోట్లు మంజూరు చేశారన్నారు. ఆయన వెంట నాయకులు శ్రీనివాస్‌మూర్తి, ఈరన్న, మంజునాథ్, రామకృష్ణ ఉన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

అమరాపురం మండలంలోని నిద్రఘట్ట గ్రామానికి చెందిన వైసిపి 9 వార్డ్ మెంబర్ దొడ్డ రంగప్పతో సహా 25 కుటుంబాలు గుండుమల సమక్షంలో టిడిపిలోకి చేరాయి. వారిలో శివన్న, పాండురంగప్ప, నారాయణప్ప, చిత్తప్ప, సురేష్, గుజ్జారప్ప, దొడ్డ రంగప్ప, మంజునాథ, టి.గుజ్జారప్ప, మల్లన్న, మంజునాథ, తిప్పేస్వామి, తదితరులకు గుండుమల పసుపు కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్ర మంలో నాయకులు నరసింహామూర్తి, మండల కన్వీనర్ గణేష్, సర్పంచి లోకేష్, చంద్రశేఖర్, దాదు, హనుమంతరాయ, భూతరాజు, సన్నరంగప్ప, రామన్న, నరసింహప్ప, లక్ష్మణ, కృష్ణమూర్తి, జయకుమార్ పాల్గొన్నారు.

బిసిల ఐక్యతతోనే రాజ్యాధికారం

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

బిసిలు ఏకమై ఒక తాటిపైకి వస్తేనే రాజ్యాధికారం సాధ్యమని బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకర్రావు పేర్కొన్నారు. పట్టణంలో బుధవారం సంఘం జిల్లా అధ్యక్షుడు నామాల శంకర్ అధ్యక్షతన బిసి సంక్షేమ సంఘం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముందుగా స్థానిక గణేష్ సర్కిల్ నుంచి శిల్పారామం వరకూ 'బిసి ఐక్యత వర్ధిల్లాలి' అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. సమావేశంలో ముఖ్య అతిథి కేశన శంకరరావు మాట్లాడుతూ కులాలతో పని లేకుండా పార్టీలకు అతీతంగా బిసిలు ఏకమై రాజ్యాధికారం పొందాలన్నారు. కార్యక్రమం లో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిసి.రమేష్, పిసి.గంగన్న, నాయకులు సామకోటి ఆదినారాయణ, కొట్టాల శ్రీరాములు, వేణుగోపాల్, కొండమరాజు, హరికృష్ణ, పొట్ల గంగాద్రి, మల్లెల జయరాం, పల్లపు జయచంద్ర, జె.కృష్ణమూర్తి, రజక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివప్ప, గఫూర్ పాల్గొన్నారు.

బిసిల పేరుతో రాజకీయాలు చేస్తే సహించం

రాజకీయ లబ్ధి కోసం బిసిల పేరుతో కొందరు సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారని, బిసిల పేరుతో రాజకీయాలు చేస్తే సహించమని బిసి నాయకులు మండిపడ్డారు. జిల్లా బోయ వాల్మీకి సాధికార అధ్యక్షుడు రామాంజనేయులుతో పాటు పలువురు నాయకులు బుధవారం సమావేశమై శిల్పారామంలో నిర్వహించిన రాజకీయ సమావేశాన్ని ఖండించారు. వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇలాంటి కార్యక్రమాలు చేపట్టే నాయకుల పట్ల బీసీలు నమ్మవద్దని కోరారు. సమావేశంలో తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అంబులెన్స్ రమేష్, కొత్తచెరువు టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, బళ్లారి సుధాకర్, నాయకులు బండ్లపల్లి రాజు, కేశప్ప, శివ, సోము పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

చిలమత్తూరు : మండలంలోని వీరాపు రం గ్రామపంచాయతీ లక్ష్మీపురంలో తాగునీటి సమస్యను పరిష్కరించాల ని కోరుతూ బుధవారం వీరాపురం సచివాలయంలో సిపిఎం నాయకులు ఖాళీ కుర్చీకి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ తాగునీటి పైప్‌లైన్ పగిలి నీటి సమస్య ఏర్పడడంతో పాటు పైపు పగిలిన చోట నీరు కలుషితమై గ్రామస్తులు అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. వెంటనే పైప్ లైన్‌కు మరమ్మతులు చేసి నీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్యదర్శికి సమస్యను వివరించేందుకు వెళ్లగా అందుబాటులోకి రాలేదని, దీంతో ఖాళీ కుర్చీకి వినతి పత్రం అందజేశామన్నారు. వెంటనే తాగునీటి సమస్య పరిష్కరించాలని లేనిచో సచివాలయం ముందు ఆందో ళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు సుధాకర్, మంజు, వెంకటేష్ పాల్గొన్నారు.



ఖాళీ కుర్చీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఇసుక ట్రాక్టర్, మద్యం పట్టివేత

పరిగి : మండలంలోని శ్రీరంగరాజులపల్లి గ్రామ సమీపంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్ఐ సత్యనారాయణ సిబ్బందితో దాడులు చేసి ట్రాక్టర్‌ను సీజ్ చేసి ఒకరిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బిందునగర్‌లో రంగమ్మ, పైడేటి గ్రామం వద్ద చిన్న అంజనప్ప కర్నాటక మద్యం అమ్ముతుండగా మద్యం సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.